నమస్తే తెలంగాణ
# కామారెడ్డి
10 | నిజామాబాద్, సోమవారం 7 ఏప్రిల్ 2025 | KAMAREDDY



కామారెడ్డి పట్టణంలో రాములోరి కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

భక్తులకు తాళిబొట్టును చూపిస్తున్న వేద పండితుడు



ఉత్సవ మూర్తులు

- ఉమ్మడి జిల్లాలో భక్తిశ్రద్ధలతో శ్రీరామ నవమి వేడుకలు
- కిటకిటలాడిన రామాలయాలు
- కొనసాగిన ప్రత్యేక పూజలు, అన్నదానాలు
- పోచంపాడ్‌లో పట్టువస్త్రాలు సమర్పించిన మాజీ మంత్రి వేముల

# కమనీయం.. రాములోరి కల్యాణం

**ఉమ్మడి జిల్లాలో** ఆదివారం శ్రీరామ నవమి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉదయం నుంచే రామాలయాలకు భక్తులు పోటెత్తారు. శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య సీతారాముల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఖిల్లా రఘునాథాలయం, సుభాష్‌నగర్ రామాలయం, బ్రహ్మపురి పెద్దరాంమందిరం, మాధవ్‌నగర్, న్యాల్‌కల్‌రోడ్‌లోని కోదండ రామాలయం, జెండా బాలాజీ మందిరం, కామారెడ్డి జిల్లా కేంద్రంలోని రామాలయంతోపాటు పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పోచంపాడ్‌లోని కోదండ రామాలయంలో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

–సుభాష్‌నగర్, ఏప్రిల్ 6



పోచంపాడ్ రామాలయంలో స్వామివారికి సమర్పించేందుకు పట్టువస్త్రాలను తీసుకెళ్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి దంపతులు



రోడ్డు ప్రమాదాల్లో కోల్పోతున్న ప్రాణాలు

- హెల్మెట్ ధారణపై త్వరలో పోలీసుల స్పెషల్ డ్రైవ్
- ప్రతి ద్విచక్రవాహనదారుడు ధరించేలా అవగాహన
- మార్కెట్‌లో జోరుగా నకిలీ హెల్మెట్ల విక్రయాలు
- తనిఖీలు చేపడితే బయటపడే అవకాశాలు
- జిల్లాలో అందుబాటులో లేని నాణ్యత ఉన్న శిరస్త్రాణాలు

# శిరస్త్రాణంపై నిర్లక్ష్యం!

**ఉమ్మడి జిల్లాలో** తరచూ ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాలు ఢీకొని, తలకు బలమైన గాయాలై మృత్యువాత పడుతున్నారు. వీరు హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణ నష్టం తప్పేది. ఈ విషయంపై ద్విచక్రవాహనదారులకు అవగాహన ఉన్నా ..హెల్మెట్ ధరించడంపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రమాదం జరిగితే తప్ప హెల్మెట్ ఎంత ముఖ్యమో తెలిసి రావడంలేదు. ఈ నేపథ్యంలో నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో హెల్మెట్‌ధారణ కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నారు. సీపీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత పి.సాయి చైతన్య ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ఇప్పటికే మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. హెల్మెట్ వాడకాన్ని కచ్చితంగా అమలుచేయడంతోపాటు నాణ్యమైన హెల్మెట్లు మాత్రమే వాడాలంటూ పోలీసులు సూచిస్తున్నారు.

–నిజామాబాద్, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

**శిరస్త్రాణం** ధరించే వాహనదారులకు జరిమానా విధించేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా గ్రామాల్లో హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్నప్పటికీ వాహనదారుల్లో మార్పు కనిపించడంలేదు. హెల్మెట్ ఉన్నా ధరించకుండా ప్రయాణాలు చేస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇలా ఉమ్మడి జిల్లాలో రోడ్డు ప్రమాదాల్లో తలకు బలమైన గాయాలై మృతి చెందిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఈ నేపథ్యంలో హెల్మెట్‌ను తప్పనిసరి చేస్తూ, ప్రతి ఒక్కరూ ధరించేలా పోలీసు శాఖ చర్యలు తీసుకోనున్నది. పోలీసుల నిర్ణయాన్ని ప్రజలంతా స్వాగతిస్తున్నప్పటికీ ప్రస్తుతం మార్కెట్లో నాణ్యమైన హెల్మెట్లు అందుబాటులో లేవు. బొటాబొటిగా ఉన్న దుకాణాల్లో కనీస ప్రమాణాలు పాటించనివే ఎక్కువగా విక్రయిస్తున్నారు. ఐఎస్ఐ మార్క్ ఉన్న హెల్మెట్లు కనిపిస్తున్నప్పటికీ అవన్నీ ఫేక్ ముద్రణతో తయారు చేసినట్లుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హెల్మెట్ కోసం రూ.వెయ్యి వరకు వెచ్చించే వాహనాదారులకు విక్రయదారులు కుచ్చుటోపి పెడుతున్నారు. నకిలీ హెల్మెట్ పేరుతో త్వరలో పోలీసులు డ్రైవ్ కొనసాగించే అవకాశాలు ఉండడంతో ఏది నకిలీ .. ఏది ఒరిజినల్ హెల్మెట్ అనేది ఎలా తెలుసుకోవాలో తెలియక సామాన్యులు తలలు పట్టుకుంటున్నారు. మార్కెట్లో నాణ్యమైన హెల్మెట్లు అందుబాటులోకి తీసుకురావడంతోపాటు నకిలీ హెల్మెట్ల విక్రయదారులను నిరోధించాలని పోలీసులను ప్రజలు కోరుతున్నారు.

## కరీంనగర్ సిద్ధాంతం పాటించరా?

గతంలో కరీంనగర్‌లో సీపీగా కమలాసన్ రెడ్డి సుదీర్ఘ కాలం పని చేశారు. హెల్మెట్ వినియోగంపై డ్రైవ్ నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించని వారిని పట్టుకుని కలిగే నష్టాన్ని వివరించారు. నకిలీ హెల్మెట్లను పట్టుకుని స్వయంగా ధ్వంసం చేశారు. పోలీసుల భయంతో పైపై హెల్మెట్లను ధరిస్తే వాటిని అనుమతించలేదు. ఇలా ఒకటికి పది సార్లు రోడ్డుపైకి వచ్చి సీపీగా కమలాసన్ రెడ్డి చేసిన కృషితో రాష్ట్రంలోనే హెల్మెట్ వాడకంలో కరీంనగర్ జిల్లా ప్రశంసలు అందుకున్నది. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో గతేడాది ఆగస్టు 15 నుంచి హెల్మెట్ డ్రైవ్ కచ్చితంగా అమలు చేస్తామంటూ అప్పటి సీపీ కల్మేశ్వర్ ఆదేశాలిచ్చారు. కానీ ఇది అమలుకాలేదు. పోలీసులే హెల్మెట్ వాడకాన్ని సీరియస్‌గా తీసుకోకపోవడంతో గత సీపీ ఆదేశాలు బుట్ట దాఖలయ్యాయి. గత్యంతరం లేక హెల్మెట్ ధారణను మధ్యలోనే నిలిపేసి పైపైనే జరిమానా విధించి చేతులు ఎత్తేశారు. హెల్మెట్ డ్రైవ్‌ను కేవలం ట్రాఫిక్ విభాగానికే పరిమితం చేయడంతో ప్రతిసారి ఈ కార్యక్రమం నీరుగారిపోతున్నది. వీఐపీ టూర్లు, ట్రాఫిక్ ఇబ్బందులను సరి చేయడానికే ట్రాఫిక్ పోలీసులకు సమయం సరిపోకపోవడంతో శిరస్త్రాణంపై దృష్టి పెట్టడం కత్తిమీద సాములా మారింది. ప్రజల్లో మార్పు కోసం చేపట్టే ఈ కార్యక్రమాన్ని తూతూ మంత్రంగా మార్చకూడదంటూ ప్రజల నుంచి డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఐఎస్ఐ మార్క్‌తో కూడిన నాణ్యమైన హెల్మెట్లు అందుబాటులోకి తీసుకు రావడం, కచ్చితంగా హెల్మెట్ వినియోగంపై వాహనాదారులను మరింత చైతన్యపర్చడాన్ని ఉద్యమంగా ముందుకు తీసుకు రావాలని సీపీ సాయి చైతన్యను జిల్లా వాసులు కోరుతున్నారు.

### దాడులతో బట్టబయలు..

జిల్లా కేంద్రంలో తిరుమల టాకీస్ రోడ్డు, నెహ్రూ చౌక్, గాంధీ చౌక్, బోధన్ రోడ్డు, అర్సపల్లి, వినాయక్‌నగర్‌లో హెల్మెట్ దుకాణాలున్నాయి. వీటిల్లో అడపాదడపా దాడులు నిర్వహిస్తే హెల్మెట్ల బాగోతం బట్టబయలవుతుందని ప్రజలు కోరుతున్నారు. బోధన్, ఆర్మూర్ పట్టణాల్లోనూ విచ్చలవిడిగా అమ్మకాలు కొనసాగుతున్నాయి. వీటిల్లో ఐఎస్ఐ ప్రమాణాలతో కూడినవి లేవన్నది ప్రధాన ఆరోపణ.



### విచ్చలవిడిగా నకిలీ అమ్మకాలు..

నిజామాబాద్ మార్కెట్లో నాణ్యమైన హెల్మెట్లు లభించడం లేదు. ఆటోమొబైల్ కంపెనీల్లోనూ మోసాలు కనిపిస్తున్నాయి. ప్రైవేటు దుకాణాల్లో నాణ్యమైన హెల్మెట్లు పత్తాలేకుండా పోయా యి. పోలీసుల జరిమానాల భయంతో గ్రామీణ ప్రాంతాల నుంచి వస్తున్నవారు శిరస్త్రాణాలను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. కొత్త బైక్‌లను కొన్నప్పుడు ఇచ్చే హెల్మెట్లు నాణ్యంగా, ఐఎస్ఐ మార్క్ ముద్రితంగా కొన్ని మాత్రమే ఉంటున్నాయి. మిగితావి నాణ్యమైనవి లేకపోవడంపై వాహనాదారులు ఇబ్బంది పడుతున్నారు. తక్కువ క్వాలిటీ కలిగిన హెల్మెట్లను అధిక ధరలకు విక్రయిస్తూ పెద్ద ఎత్తున సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులపై పోలీసులు కన్నెత్తి చూడడం లేదు.

# ఆకట్టుకున్న కుస్తీ పోటీలు

కోటగిరి, ఏప్రిల్ 6: శ్రీరామ నవమి పండుగ పురస్కరించుకొని నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలో ఆదివారం కోటగిరి మీదిగల్లీ నాయకుల ఆధ్వర్యంలో కుస్తీ పోటీలను నిర్వహించారు. చుట్టు పక్కల ప్రాంతాలతోపాటు మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి మల్లయోధులు తరలివచ్చి, కుస్తీ పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి నగదు బహుమతి అందజేశారు. పోటీలను తిలకించడానికి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.





కోటగిరిలోని వినాయక్‌నగర్‌లో కుస్తీ పోటీల్లో పాల్గొన్న మల్లయోధులు

# మంచం పట్టిన దౌల్తాపూర్

- కీళ్లు, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్న గ్రామస్తులు
- రోజురోజుకూ పెరుగుతున్న బాధితుల సంఖ్య
- 15 రోజులైనా పట్టించుకోని ఆరోగ్య శాఖాధికారులు

కీళ్ల నొప్పులతో బాధపడుతున్న ఓ మహిళ



బిచ్కుంద, ఏప్రిల్ 6: మండలంలోని దౌల్తాపూర్ గ్రామం మంచం పట్టింది.కొన్ని రోజులుగా గ్రామస్తులు మోకాళ్లు, కీళ్లు, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్నారు. గ్రామంలో సుమారు 120 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. 15 రోజుల క్రితం ఇద్దరితో మొదలైన బాధితుల సంఖ్య ఇప్పటివరకు 40 మందికి చేరింది. ఇందులో కొందరికి రక్తంలోని ప్లేట్‌లేట్ల సంఖ్య తగ్గినట్లు తెలుస్తోంది. అసలు ఏ వ్యాధి సోకిందోనని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ దవాఖాన వెళ్తే పరీక్షలు నిర్వహించకుండా కేవలం మాత్రలు ఇచ్చి పంపించారని వాపోతున్నారు. దీంతో గ్రామస్తులు స్థానిక ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. ఆర్థిక స్థోమత ఉన్నవారు మహారాష్ట్రలోని దెగ్లూర్, బాన్సువాడ, నిజామాబాద్‌కు వెళ్లి వైద్యం చేయించుకుంటున్నారు. గ్రామస్తులు అనారోగ్యం బారిన పడ్డారని తెలిసినా అధికారులు గ్రామం వైపు కన్నెత్తి చూడడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై పుల్కల్ పీహెచ్‌సీ డాక్టర్ సమద్‌ను వివరణ కోరగా గ్రామస్తులు అనారోగ్యం బారిన పడినట్లు తన దృష్టికి రాలేదని తెలిపారు.సోమవారం తమ సిబ్బందితో కలిసి గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను అందజేస్తామని పేర్కొన్నారు.



### ఎన్ని గోలీలు మింగినా తగ్గుతలేదు..

నేను పదిహేను రోజుల నుంచి మోకాళ్లు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్న. ఎన్ని గోలీలు మింగినా తగ్గుతలేదు. నాలెక్క ఊర్ల చాలా మందికి అయితుంది. పెద్ద సార్లు మా ఊరికి వచ్చి పరీక్షలు చేయాలి.

-హన్మవ్వ, గ్రామస్తురాలు

### గ్లూకోజ్ పెట్టమంటే గోలీలిచ్చింద్రు


నేను కూడా మోకాళ్లు, కీళ్ల నొప్పులతో బాధ పడుతున్న. నా మాదిరిగా మా ఊరిలో చాలా మంది బాధ పడుతున్నరు. సర్కారు దవఖానకుపోయి గుల్‌కోజ్ పెట్టమంటే గోలీలు ఇచ్చి పంపించిన్రు. అధికారులు స్పందించి మాఊరిలో క్యాంపు ఏర్పాటు చేయాలి.

-హన్మంత్ రావు పటేల్, గ్రామస్తుడు



దౌల్తాపూర్ గ్రామం

# ఎస్సారెస్పీలో తగ్గుతున్న నీటిమట్టం



మోర్తాడ్, ఏప్రిల్ 6: నిజామాబాద్ జిల్లా మెండోరా మండలంలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం రోజురోజుకూ తగ్గుతున్నది. ఈనెల 9 ఉదయం 6గంటల వరకు ప్రాజెక్ట్ నుంచి యాసంగి పంటలకు నీటి విడుదల కొనసాగిస్తుండడంతో ప్రాజెక్ట్‌లో నీటిమట్టం తగ్గుముఖం పడుతున్నది. ఇంకా మూడు రోజుల పాటు నీటి విడుదల కొనసాగనున్నది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు(80.5టీఎంసీలు) కాగా, ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో కేవలం 1063అడుగుల(13.601టీఎంసీలు) నీరు నిల్వ ఉన్నది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువకు 3500 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 250, అలీసాగర్ ఎత్తిపోతలకు 240, గుత్ప ఎత్తిపోతలకు 300, సరస్వతీ కాలువకు 700, మిషన్‌భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.